క్లుప్తంగా

రజతోత్సవ సభను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్ : 27న వరంగల్ లో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని గురువారం క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. కేసీఆర్ బహిరంగ సభ సమయం, వివరాలను తెలియజేస్తూ సభ వాల్ పోస్టర్లు అంటించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై గురువారం కార్పొరేటర్ పుష్ప వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. త్వరగా పూర్తి చేస్తే ప్రారంభోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. వేసవిలో విద్యుత్, తాగునీటి సమస్య రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీఓలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న జానకీరెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల ఎంపీపీ కార్యాలయాన్ని గురువారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ దశరథ్‌ను కలిసిన నాయకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌కు బదిలీపై వచ్చిన నూతన తహసీల్దార్ దశరథ్‌ను గురువారం కుల సంఘాల నాయకులు మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఆయనను కలిసిన వారిలో బేడబుడగ జంగం నాయకులు శ్రీనివాస్, మాదినం శివప్రసాద్, హోలియదాసరి సంఘం నాయకులు గణేష్, సమతాసైనిక్ దళ్ నాయకులు రవికుమార్, బాలరాజ్, దశరథ్, చంద్రశేఖర్ ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని చెట్లపోతారంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్యాన్‌పూర్ సిస్టం పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం ఆ పరిశ్రమ ప్రతినిధులు సందీస్ సంగమేశ్వరన్ నేకర్ బస్వారాజ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో రూ.3లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీఎం రాజశేఖర్ రెడ్డి, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

సైనిక్ ఫండ్‌కు విరాళాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గురువారం ఇంటింటికి తిరుగుతూ సైనిక్ ఫండ్‌కు విరాళాలు సేకరించారు. బుధవారం వార్షిక పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులు, దేశ భద్రత ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ సరిహద్దుల్లో నిరంతరం కాపలా కాస్తూ, పోరాటం చేసే సైనికుల కోసం మేమున్నాం అని భరోసా కల్పిస్తూ గ్రామంలోని ప్రజల దగ్గరికి వెళ్లి సైనిక్ ఫండ్‌కు విరాళాలు సేకరించారు. హెచ్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ.. పాఠశాలలో సైనిక ఫండ్ బాక్స్ ఏర్పాటు చేశామని, అందులోకి వచ్చిన విరాళాలు, విద్యార్థులు సేకరించిన విరాళాలను కలిపి ఆ మొత్తాన్ని బ్యాంకు నందు డీడీ తీసి డీడీని ఉన్నతాధికారుల ద్వారా కలెక్టర్ కార్యాలయంలోని సైనిక్ ఫండ్ విభాగానికి పంపుతామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు

అధ్వానంగా గ్రామీణ రోడ్లు!

బీటీ కంకరు తేలి.. గుంతలు పడ్డ వైనం

- రాకపోకలకు వాహనదారులు, ప్రజలు అవస్థలు
- కొన్నేళ్లుగా మరమ్మతులు కరువు



కంకర తేలిన హద్నూర్- రాంతీర్థం రోడ్డు

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పంచాయతీరాజ్ రోడ్లు అధ్వానంగా మారాయి. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లపై బీటీ, కంకరు లేచి గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్లపై వాహనదారులు, ప్రజలు ప్రయాణించాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. పట్టణం నుంచి అల్గోల్ గ్రామాలను కలుపుతూ వేసిన రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై గుంతలు ఏర్పడి కంకరు తేలింది. గుంతలతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అల్గోల్, పాట్‌పల్లి, ఎల్గోయి తదితర గ్రామాల ప్రజలు జహీరాబాద్‌కు పనుల నిమిత్తం వస్తుంటారు. కూలీలు పనుల చేసే వారు కూడా వచ్చి వెళ్లే సమయంలో అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి బూచినెల్లి గ్రామం వరకు ఉన్న రోడ్డు కూడా ధ్వంసమైంది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఇప్పటి వరకు పలు ప్రమాదాలు చోటు చేసుకుని ఒకరు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఝరాసంగం మండలంలోని ఎల్గోయి- మొక్కన్‌పాడ్, రాయిపల్లి- కృష్ణపూర్, దేవరంపల్లి, బోప్పన్‌పల్లి, ఝరాసంగం-చిలమామిడి రోడ్లు పూర్తిగా పాడైయ్యాయి. న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్- రాంతీర్థం రోడ్డుపై బీటీ, కంకరు లేచి అధ్వానంగా మారాయి. లేచిన కంకరు వాహనాల టైర్లకు గుచ్చుకోవడంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వాలు మారినా రోడ్ల దుస్థితి మాత్రం మారడం లేదు. శంశెల్లాపూర్-వడ్డీ, చాల్కి- కర్నాటక రాష్ట్ర సరిహద్దు, గంగ్వార్- బసంత్‌పూర్-మామిడ్గి రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. కోహీర్ మండలంలోని బడంపేట-మనియార్‌పల్లి, పోత్‌రెడ్డిపల్లి-కోహీర్, పిచరాగడి-పిచరాగడి తండా, ఖనాపూర్-సజ్జపూర్, శేఖాపూర్- బడంపేట రోడ్లు దెబ్బతినడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

రద్దయిన నిధులు

నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 51 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియతో పాటు కాంట్రాక్టర్ పనులు చేపట్టడంలో జాప్యం జరిగింది. అంతలోనే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నిధులు రద్దయ్యాయి. దీంతో రోడ్ల మరమ్మతుల పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టీజీఐసీసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, నిర్మలారెడ్డి

కంది(సంగారెడ్డి): రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని టీజీఐసీసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. గురువారం కంది, ఇంద్రకరణ్‌ల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నిర్మలారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా కొత్తరేషన్ కార్డులను త్వరలో అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆశాజ్యోతి, సీఎస్‌సీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, మాజీ జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, సొసైటీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించడం ద్వారా మద్దతు ధరను పొందవచ్చని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి అన్నారు. గురువారం మండలంలోని బిజిలీపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

జహీరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని జెడ్పీ సీఈఓ, నియోజకవర్గం ప్రత్యేక అధికారి జానకీ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయా మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్, ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. నిరు పేదలు, వికలాంగులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో, మున్సిపల్ పరిధిలో ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే వెంటనే గుర్తించి పరిష్కరించాలన్నారు. సమస్య అధికంగా ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరావు, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పా రు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రూ.1500 చొప్పున, ఒక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంగారెడ్డి పరిధిలో..

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం బుధవారం జాతీయ రహదారి, పాతబస్టాండ్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నలుగురికి రూ.2000 చొప్పన, మిగతా నలుగురికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం

బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆదర్శ్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమించి పరిష్కారానికి కృషి చేస్తామని బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. రానున్న రోజుల్లో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. 27న జరిగే చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 19న జిన్నారంలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్‌గౌడ్, రాజేష్‌లు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలను తూచా తప్పకుండా పాటించాలని కర్మాగారాల భద్రల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం జిన్నారం మండలంలోని గడ్డిపోతారం పరిశ్రమవాడలో జరిగిన 54వ జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌కు సన్మానం

మునిపల్లి అందోల్): తెలంగాణ హైకోర్టు బార్ అసోషియేషన్ ప్రెసిడెంట్ జగన్‌ను హైకోర్టు న్యాయవాది శశికుమార్ శాలువా కప్పి సన్మానించారు. మునిపల్లి మండలంలోని బుస్సారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శశికుమార్ గురువారం హైకోర్టులో ప్రెసిడెంట్‌ను మర్యాదపూర్వకంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కందుల జయశ్రీ, చంద్రశేఖర్, జొన్నాడ రామ్‌ప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.

◆ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు విరాళం

కంది(సంగారెడ్డి): మండలంలోని చిద్రుప్పలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు సంగారెడ్డి నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్ లక్షా పదివేల రూపాయల విరాళం అందజేశారు. గురువారం ఆలిండియా సమత సైనిక్ దళ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మురహరికి విరాళాన్ని ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు శివగల ప్రభాకర్, మాజీ వార్డ్ మెంబర్ యాదయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

◆ మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

కంగ్టి(నారాయణఖేడ్): అధికారం కోసం అబద్ధపు వాగ్దానాలతో అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. 27న వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్ అధ్యక్షతన తడ్కల్ గ్రామంలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే సమావేశంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలందరికిని మోసం చేశారని ఆరోపించారు. మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి మాజీ సర్పంచ్‌లు, ముఖ్యకార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ మున్సిపల్ వాటర్ సప్లై సూపర్‌వైజర్ మృతి

నారాయణఖేడ్: మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా విభాగం సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జన్వాడె బస్వరాజ్ (58) అనారోగ్యంతో గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. బుధవారం సైతం విధులకు హాజరయ్యారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి బస్వరాజ్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మృతిపై పలువురు మాజీ కౌన్సిలర్లు సంతాపం వ్యక్తం చేశారు.

◆ అగ్ని ప్రమాదాలపై అవగాహన

సంగారెడ్డి క్రైమ్: అగ్నిమాపక శాఖ వారోత్సవాలు భాగంగా పట్టణంలోని జ్యోతిర్మయి హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. హాస్పిటల్‌లో తప్పనిసరిగా ఫైర్‌స్టేఫీ సాధనాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం అగ్నిప్రమాదాల నివారణకే హాస్పిటల్‌లో వాల్‌పోస్టర్ అతికించిన అధికారులు, రాత్రి సమయాల్లో విద్యుత్ అవసరం లేని సమయాల్లో మెయిన్ స్విచ్చాఫ్ చేసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ బెల్ట్ షాపులు నిషేధిస్తూ తీర్మానం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని తంగడపల్లి గ్రామంలో బెల్ట్ షాపులను నిషేధిస్తూ గురువారం గ్రామపెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బెల్ట్ షాపుల నిషేధానికి గ్రామప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తీర్మానం కాపీని సీఐ మహేశ్‌గౌడ్‌కు అందజేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్, మాజీ సర్పంచ్ సంగమేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

◆ నేడు తాటిపల్లి మంత్రి రాక

మునిపల్లి(అందోల్): తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు శుక్రవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర వస్తున్నట్లు తాటిపల్లి గ్రామ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ అధ్యక్షుడు మారుతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ. 10 గంటలకు మంత్రి వస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి, నిర్మలారెడ్డి తదితరులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నాగులపల్లి ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, టీజీఐసీసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్యా అందుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని కోరుతూ వాల్ పోస్టర్‌ను రూపొందించిన ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, జయకృష్ణలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీఓ రవీంద్రరెడ్డి, తహసీల్దార్ సరస్వతి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, వైస్ చైర్మన్ కృష్ణ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషి

పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అక్సాన్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం అందోల్‌లోని డాకూర్ నుంచి కొడెకల్ వెళ్లే బీటి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామీణ రోడ్ల అభివృద్ధికి నిధులను మంజూరు చేసి నూతన రోడ్లుగా నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ ఉపాధి



కూలీలతో మాట్లాడుతున్న నర్సింహులు

నారాయణఖేడ్: ఉపాధిహామీ చట్టం ప్రకారం అడిగిన వారందరికీ ఉపాధి హామీలో పనులను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఖేడ్ మండలం ర్యాకల్, సిర్గాపూర్, కద్పల్ శివార్లలోని ఉపాధిహామీ పని ప్రదేశాల్లో పర్యటించి కూలీలతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, కాల్వల పనులను కేంద్ర ప్రభుత్వం ఎత్తేయడంతో అవసరం ఉన్న కూలీలకు పనులు దొరకడం లేదన్నారు. పనులను పునరుద్ధరించి కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 కూలీ చెల్లించడంతో పాటు బకాయి కూలీ డబ్బులను చెల్లించాలన్నారు.

రసాయనాల లీకేజీతోనే అగ్ని ప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పటాన్‌చెరు: రసాయనాలు లీకేజీతో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన పాశమైలారం పారిశ్రామికవాడలో చోటుచేసుకుంది. పాశమైలారం పారిశ్రామికవాడలో వెంకార్ కెమికల్స్ పరిశ్రమలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో మూడు అగ్నిమాపక శకటాలు, పక్క పరిశ్రమల్లో ఉన్న మంటలను ఆర్పే ఎక్విప్‌మెంట్‌తో మంటలను పెరగకుండా అదుపు చేశారు. పటాన్‌చెరు, సంగారెడ్డి నుంచి అగ్నిమాపక శకటాల రావడంతో రెండు గంటల సమయంలోనే మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదకరమైన రసాయనాల లీకేజీ కారణంగానే అగ్నిప్రమాదం చోటు చేసుకుందని జిల్లా అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టి , రోడ్డును విస్తరణ చేయాలని సీపీఎం పార్టీ డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రంగారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇంద్రేశం నుంచి పెద్ద కంజర్ల వరకు వెళ్లే రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం మీదుగా రోజువారీగా వేలాది మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారని, భారీ నుంచి అతి భారీ వాహనాలు అధికలోడుతో వెళ్తున్నాయని అన్నారు. దీంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిపోయిందన్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినా ఇంకా పెండింగ్‌లోనే పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాస్, రామకృష్ణ, నారాయణ ఇతరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న బీజేపీ

కాంగ్రెస్ నేత నీలం మధు



ఈడీ కార్యాలయం ఎదుట నిరసనలో మధు

పటాన్‌చెరు టౌన్: సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని కేంద్ర బీజేపీ సర్కార్ ప్రతిపక్షాల నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ నేత నీలం మధు ఆరోపించారు. గురువారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట చేపట్టిన భారీ నిరసన కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి పాల్గొన్నారు. నీలం మధు మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఈడీని అడ్డుపెట్టుకొని సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై తప్పుడు కేసులు బనాయిస్తూ రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాలతో మేలు

ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివకుమార్ తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వ జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులు పండించిన జొన్నలు విక్రయించి లబ్ధి పొందాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఏడాకులపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 3371 లకు అమ్ముకోవాలని.. దళారులను ఆశ్రయించవద్దని పేర్కొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్



ధరణిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల గ్రామానికి చెందిన ధరణి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ రన్నింగ్‌లో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి, ధరణి తండ్రి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.